4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 6 ఏప్రిల్ 2025
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ప్రకృతి ప్రకోపాలు పాలకులకు పట్టవా?

శ్రీధర్‌రావు దేశ్‌పాండే

అరుదైన జీవ వైవిధ్యం కలిగిన కంచె గచ్చిబౌలి అడవిపైకి ప్రభుత్వం వందలాదిగా బుల్డోజర్లు పంపి విధ్వంసం చేయబూనుకుంటే హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం (హెచ్‌సీయూ) విద్యార్థులు ఆ విధ్వంసాన్ని వీరోచితంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటనా పోరాటం దేశం దృష్టిని ఆకర్షించింది. దేశవ్యాప్తంగా వారి పోరాటానికి సంఘీభావం వ్యక్తమవుతున్నది. అయినా ప్రభుత్వం ఇవేమీ పట్టనట్టుగా తన పని తాను చేసుకుపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా జీవ వైవిధ్యం కలిగిన లక్షల ఎకరాల అడవులు, వందల, వేల జల వనరులు మాయమవుతున్న కారణంగా వాతావరణంలో, పర్యావరణంలో విపరీత మార్పులు చోటుచేసుకొని ఎన్ని అనర్థాలు సంభవిస్తున్నాయో మనకు తెలిసిందే. ఈ పాపంలో అన్ని దేశాల పాలకులదే ప్రముఖ పాత్ర. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు చేస్తున్న పర్యావరణ విధ్వంసం అంతా ఇంతా కాదు. మన దేశ పాలకులు కూడా ఇందుకు అతీతులు కారు. మన అడవులు కుదించుకు పోవడానికి, మన నదులు మృత నదులుగా మారిపోవడానికి, మన చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురి కావడానికి మన పాలకుల విధానాలే కారణం. భూగోళం మీద, మన దేశంలోనూ వాతావరణంలో, పర్యావరణంలో తీవ్ర మార్పులు, వాటి పర్యవసానాల గురించి శాస్త్రవేత్తలు, నిపుణులు దశాబ్దాల తరబడి అంతర్జాతీయ వేదికలపై విస్తృతంగా చర్చిస్తున్నారు. భారత్‌లోనూ ఈ చర్చ జరుగుతున్నది.

అడవుల నరికివేత-వాతావరణ మార్పులు: రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వరుస కరువులు, అతి వరదలు సంభవించి ప్రజలు కడగండ్ల పాలవుతున్నారు. ఈ మార్పులకు అనేక కారణాలున్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఏటా మిలియన్ల హెక్టార్ల మేర అడవుల నరికివేత ప్రధాన కారణంగా ముందుకు వచ్చింది. 2001 నుంచి 2023 వరకు ప్రపంచవ్యాప్తంగా 488 మిలియన్ హెక్టార్ల అడవి భూమి మీదినుంచి మాయమైందని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అడవుల నరికివేత ఏడాదికేడాది అనూహ్యంగా పెరిగిపోతున్నది.2001లో 13.4 మిలియన్ హెక్టార్ల అడవి మాయమైతే 2023 నాటికి అది 28.3 మిలియన్ హెక్టార్లకు పెరిగిందని పర్యావరణవేత్తలు అంచనా వేస్తున్నారు. ప్రతీ నిమిషం ఒక ఫుట్‌బాల్ మైదానం అంత అడవి అమెజాన్ అడవుల నుంచి మాయమవుతున్నదట. 2018లో సుమారు 3.60 మిలియన్ హెక్టార్ల ఉష్ణ మండల అడవులు భూమ్మీద నుంచి మాయమైనట్టు ఒక అంచనా. అడవుల నరికివేత వల్ల భూగోళంపై ఉష్ణోగ్రతల్లో తీవ్ర మార్పులు సంభవిస్తున్నాయి. ఈ మార్పులు రుతు పవనాల గమనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. రుతు పవనాల మీద ఆధారపడిన వ్యవసాయిక దేశాలైన భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయాన్మార్ తదితర దక్షిణాసియా దేశాల మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకప్పుడు వానకాలం 4 నెలల పాటు వర్షపాతం ఉండేది. ఇప్పుడు వార్షిక సగటు వర్షపాతంలో తగ్గుదల లేకపోయినా వర్షం కురిసే రోజులు సుమారు 25-30 రోజులకు పడిపోయింది. వర్షం నెల, నెలన్నర రోజులు అసలే కురువదు. కురిస్తే రెండు, మూడు రోజుల్లో భారీ కుండపోత వర్షం కురిసి పోతుంది. కొన్ని గంటల్లోనే 60, 70 సెంటీ మీటర్ల వర్షం కురిసిన అనుభవాలు ఇటీవలే మన తెలంగాణలోనే ఉన్నాయి. అనంతరం మళ్లీ వర్షం అతా పతా ఉండదు. ఈ దోబూచులాట మనం గత కొన్నేండ్లుగా చూస్తూనే ఉన్నాం. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వర్షం లేక కరువు పరిస్థితులను చూశాం. సెప్టెంబర్, అక్టోబర్‌లో భారీ వర్షపాతం, నదుల్లో వరద బీభత్సం చూశాం. ఫిబ్రవరి నుంచి తిరిగి ఎండలు దంచి కొట్టే పరిస్థితులు వస్తాయి. ఈ కారణంగా దేశంలో విచిత్ర పరిస్థితి నెలకొంటున్నది. కరువులు-వరదలు దాదాపు ఏటా పునరావృతమవుతున్నాయి.

వాతావరణ పునరుద్ధరణకు మార్గాలు: వాతావరణ మార్పులను నియంత్రించి తిరిగి గాడిలో పడేయాలంటే భూగోళం మీద అడవుల నరికివేతను నియంత్రించడం, నరికివేతకు గురైన అడవులను తిరిగి పునరుజ్జీవింపజేయడం, కర్బన ఉద్ధారాలను నియంత్రించడం తప్పనిసరి అవసరమని పర్యావరణవేత్తలు భావిస్తున్నారు. 10 వేల ఏండ్ల కిందట భూగోళం 45 శాతం అంటే 60 వేల లక్షల హెక్టార్ల అడవులతో నిండి ఉండేది. ఇప్పుడు అది 31 శాతానికి అంటే, 40 వేల లక్షల హెక్టార్లకు పడిపోయింది. కాబట్టి, భూమి మీద అడవులను పునరుజ్జీవింపజేయడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, వాతావరణ ఉష్ణోగ్రతను పెంచే కర్బన ఉద్ధారాలను (Carbon Emissions) తగ్గించడం మానవాళి ప్రథమ కర్త వ్యమని పర్యావరణ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. లేకపోతే మానవజాతి సహా అన్ని జీవజాతుల మనుగడ ప్రమాదంలో పడిపోతుంది.

అతిపెద్ద మానవ ప్రయత్నాలు: భూగోళంపై గ్రీన్ కవర్‌ను పెంచడానికి, కర్బన ఉద్ధారాలను తగ్గించడానికి ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద మానవ ప్రయత్నాలు అనేక రూపాల్లో జరుగుతున్నట్టు తెలుస్తున్నది. ఇటువంటి ప్రయత్నాలు చైనా, బ్రెజిల్, చిలీ, అర్జెంటీనా, ఆఫ్రికా తదితర దేశాల్లో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన హరితహారం ఇటువంటి అతిపెద్ద మానవ ప్రయత్నాల్లో చోటు సంపాదించుకున్నది. వాటి సంగతులు సంక్షిప్తంగా తెలుసుకుందాం.

గ్రేట్ గ్రీన్‌వాల్ ఆఫ్ చైనా: చైనా ఉత్తర ప్రాంతంలో ఉన్న రాష్ట్రాల్లో గోబి ఎడారి విస్తరణ ప్రమాదకరమైన స్థాయికి చేరుకున్నది. వాతావరణ ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం తగ్గిపోవడం వంటి పరిణామాలతో గోబి ఎడారి 1975 నుంచి ఇప్పటివరకు 55,000 చదరపు కిలోమీటర్లు విస్తరించినట్టు ఒక అంచనా. గోబి ఎడారి నుంచి వచ్చే ఇసుక తుఫానుల వల్ల 400 మిలియన్ల ప్రజలు కడగండ్ల పాలవుతున్నారు. ప్రజలను ఈ ఉత్పాతం నుంచి రక్షించడానికి గోబి ఎడారికి చెట్లతో ఒక గోడను నిర్మించాలని చైనా ప్రభుత్వం తలపెట్టింది. 1979లో గోబి ఎడారి విస్తరణను నివారించడానికి 500 కోట్ల మొక్కలను నాటే కార్యక్రమం చైనా ప్రభుత్వం అమలుచేయడం ప్రారంభించింది. దీన్ని 'ది గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ చైనా' అని పేరు పెట్టారు. 4500 కి.మీ.ల పొడవున, 3,50,000 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని 2050 వరకు పూర్తిచేయాలని సంకల్పించింది. ఇది మొక్కలు నాటడానికి చేస్తున్న అతిపెద్ద మానవ ప్రయత్నంగా ప్రసిద్ధి చెందింది.

బ్రెజిల్ అట్లాంటిక్ అడవుల పునరుద్ధరణ: బ్రెజిల్‌లో అట్లాంటిక్ వర్షాధారిత అడవుల పునరుద్ధరణ పెద్ద ఎత్తున జరుగుతున్నది. బొగ్గు ఉత్పత్తి, పరిశ్రమలు, గృహ నిర్మాణం, వ్యవసాయ విస్తరణ.. తదితర మానవ అవసరాల కోసం వేలకు వేల చ.కి.మీ.అట్లాంటిక్ అడవులు నాశనమైనాయి. యూరప్ వలసవాదులు బ్రెజిల్ తూర్పు తీరం చేరిన 500 వందల ఏండ్ల తర్వాత అట్లాంటిక్ 10 లక్షల చదరపు కి.మీ. మిగిలిపోయిన అడవులు 7 శాతమే. అదే సమయంలో ప్రపంచానికే లంగ్ స్పేస్‌గా ఉన్న అమెజాన్ అడవుల్లో 19 శాతం నాశనమైనాయి. ఇప్పుడు బ్రెజిల్ తూర్పు తీరంలో అట్లాంటిక్ వర్షాధారిత అడవుల పునరుద్ధరణ కార్యక్రమం మొదలైంది. 2020 నాటికి 35 లక్షల ఎకరాల్లో అట్లాంటిక్ ఆడవుల పునరుద్ధరణ జరిగినట్టు పరిశీలకులు అంచనా వేశారు. ఈ ప్రయత్నం బ్రెజిల్‌తో పాటు మొత్తం దక్షిణ అమెరికా దేశాల వాతావరణ పునరుద్ధరణకు దోహదం చేస్తుందని శాస్త్రవేత్తల అంచనా.

తెలంగాణకు హరితహారం: అడవులను తిరిగి పునరుజ్జీవింపజేయడం తప్పనిసరి అవసరమని గుర్తించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని రూపొందించారు. జాతీయ అటవీ విధానంలో పేర్కొన్నవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అడవుల విస్తీర్ణాన్ని 23 శాతం నుంచి 33 శాతానికి పెంచడం హరితహారం లక్ష్యం. ఐదు దశలలో 230 కోట్ల మొక్కలను నాటడం, వాటిలో 80 శాతం మొక్కలను రక్షించుకునే విధంగా 2015 జూలైలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమైన హరితహారం కార్యక్రమం జయప్రదంగా అమలైంది. గడిచిన ఐదేండ్లలో హరితహారం కార్యక్రమంలో భాగంగా జనవరి 2023 వరకు 270.65 కోట్ల మొక్కలను నాటినట్టు తెలుస్తున్నది. ఇది 230 కోట్ల లక్ష్యాన్ని మించిపోయింది. హరితహారం అమలు తర్వాత రాష్ట్రంలో 2015తో పోల్చినప్పుడు 2021 నాటికి గ్రీన్‌కవర్ 6.85 శాతం పెరిగినట్టు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా వారు 2021లో నిర్వహించిన సర్వేలో నిర్ధారించారు. హైదరాబాద్‌లో మొక్కలు నాటడం, అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు తదితర కార్యక్రమాల వల్ల 148 శాతం గ్రీన్ కవర్ పెరిగినట్టు ఒక అంచనా. ఇది హరితహారం సాధించిన విజయంగా చెప్పవచ్చు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ చైనా, గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆఫ్రికా ప్రాజెక్టుల తర్వాత అతిపెద్ద మానవ ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమానిదే.

మానవాళి కండ్లుతెరుస్తుందా?: ఇన్ని ప్రయత్నాలు జరుగుతున్నా మనం పర్యావరణానికి చేస్తున్న హాని పరిమాణం ముందు ఇవి చాలా చాలా చిన్న ప్రయత్నాలుగా మిగిలిపోతున్నాయి. తాత్కాలిక ప్రణాళికలు, దీర్ఘ కాల ప్రణాళికలు... చిత్తశుద్ధితో అడవుల నరికివేతను తగ్గించుకోవడం, అటవీ భూములను పునరుద్ధరించుకోవడం, పెద్ద ఎత్తున చెట్లు నాటే కార్యక్రమాలు చేపట్టడం, కర్బన ఉద్ధారాలను గణనీయంగా తగ్గించుకోవడం, ఫాసిల్ ఇంధన వినియోగం నుంచి ఇతర రెన్యూయెబుల్ ఎనర్జీ వినియోగం వైపునకు మళ్లడం... ఈ ప్రయత్నాలు అన్ని దేశాలు ఏకోన్ముఖంగా సుదీర్ఘకాలం పెద్ద ఎత్తున జరిపితే తప్ప ప్రకృతి ప్రకోపం తగ్గే అవకాశం లేదు. మానవాళి ఇప్పుడైనా కండ్లు తెరుస్తుందా?

కంచ గచ్చిబౌలి ఫారెస్ట్ విధ్వంసం: ఒకవైపు పట్టణ అడవుల పెంపకంపై దృష్టి పెట్టవలసిన ప్రస్తుత ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో భాగంగా ఉన్న 400 ఎకరాల్లో కంచ గచ్చిబౌలి అడవిని ధ్వంసం చేయడానికి వందల బుల్డోజర్లను పంపించింది. అపారమైన జీవ వైవిధ్యం కలిగిన ఈ అటవీ భూమిని రక్షించుకోవడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వం వారి మీద దమనకాండకు పూనుకుంటున్నది. అది విశ్వవిద్యాలయం భూమి కాదు ప్రభుత్వ భూమి అని అంటున్నది. ఆ భూమి ఎవరిదన్నది చర్చనీయాంశం కానే కాదు. ప్రాథమికంగా ఆ భూమి పలురకాల వన్య ప్రాణులకు, మొక్కలకు సహజ ఆవాస ప్రాంతం. జల వనరులకు నిలయం. అది హైదరాబాద్ నగరానికి, ముఖ్యంగా సమీప ప్రాంతాల ప్రజలకు ఒక లంగ్ స్పేస్‌గా ఉపయోగపడుతుంది. ఈ అరుదైన లంగ్‌స్పేస్‌ను, వన్య ప్రాణుల, మొక్కల సహజ ఆవాస ప్రాంతాన్ని మాయం చేయడం అమానుషం. గత ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో వీలైనన్ని అర్బన్ పార్కులను అభివృద్ధి చేస్తే ప్రస్తుత ప్రభుత్వం ఉనికిలో ఉన్న కంచె గచ్చిబౌలి పట్టణ అడవిని ధ్వంసం చేస్తున్నది. ఈ విధ్వంసాన్ని తెలంగాణ సమాజం ప్రతిఘటించవలసిందే. కంచ గచ్చిబౌలి అర్బన్ ఫారెస్ట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న విశ్వవిద్యాలయం విద్యార్థులకు అండగా నిలవాల్సిందే.

(వ్యాసకర్త: రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజినీర్)

ఢిల్లీకి వెళ్లాలి మళ్లీ.. మళ్లీ..

రాష్ట్రంలో మంత్రి వర్గ విస్తరణ ప్రహసనంగా మారింది. నెలకు రెండు మూడు సార్లు ఢిల్లీ వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లిన ప్రతిసారి ఆశావహుల జాబితాను పట్టుకొని కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. గత సంవత్సరన్నర కాలంగా మంత్రి వర్గ విస్తరణ అదిగో చేస్తాం ఇదిగో చేస్తామంటూ కాలయాపన చేస్తున్న రేవంత్ రెడ్డి.. అధిష్ఠానాన్ని మెప్పించటానికి అష్టకష్టాలు పడుతున్నారు. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ కోసం ఢిల్లీలో చర్చలు జరగటాన్ని ఈ రాష్ట్ర ప్రజలు వింతగా గమనిస్తున్నారు. మంత్రివర్గానికి నాయకత్వం వహించి ఎవరిని తీసుకోవాలో ఎవరిని పక్కన పెట్టాలన్న నిర్ణయం మామూలుగానైతే ముఖ్యమంత్రుల చేతిలో ఉంటుంది. కానీ కాంగ్రెస్ పార్టీలోని ముఖ్యమంత్రులు మాత్రం ఆ నిర్ణయాన్ని అధిష్ఠానానికి అప్పజెప్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య, వైఎస్సార్ సహా అంతకుముందున్న కాంగ్రెస్ ముఖ్యమంత్రులు సైతం మంత్రివర్గ కూర్పు, విస్తరణ కోసం అధిష్ఠానం దగ్గర చేతులు కట్టుకొని నిలబడిన సందర్భాలున్నాయి.

మంత్రివర్గ విస్తరణకు కేవలం రేవంత్‌రెడ్డి మాత్రమే ఆశావహుల జాబితా తయారు చేయట్లేదు. ఓ వైపు పీసీసీ అధ్యక్షుడు మరోవైపు ఇద్దరు ముగ్గురు సీనియర్ నాయకులు సైతం తాము తయారు చేసిన జాబితాతో రాహుల్ గాంధీని కలుస్తున్నారు. అసలు ప్రభుత్వ వ్యవహారాల్లో పీసీసీ అధ్యక్షుడి పాత్ర ఏమిటన్నది ముఖ్యమైన ప్రశ్న. కానీ అధిష్ఠానం మాత్రం రేవంత్‌రెడ్డితో పాటు, పీసీసీ అధ్యక్షుడు తెచ్చిన జాబితాను పరిశీలించటం ముఖ్యమంత్రిపై ఆ పార్టీకున్న గౌరవానికి సూచకం. రెండు గ్రూపులుగా చీలిపోయిన రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య అధిష్ఠానం సైతం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా కాలం గడుపుతోంది. ఇప్పటికే ఏడాదిన్నర కాలం గడిచిపోయింది. చివరి ఏడాది ఎలాగూ ఎన్నికల కసరత్తులో ఉండిపోతారు. ఇక మిగిలింది రెండున్న రేళ్లు మాత్రమే. మంత్రివర్గ విస్తరణ చేసి రెండున్నరేళ్ల కాలానికి మాత్రమే పదవులు అనుభవించాలని తహతహలాడుతున్న వారికి రేవంత్‌రెడ్డి ఏమీ చేయలేకపోతున్నారు. ఇప్పటికే ఉన్న మంత్రుల్లో కొందరు తమను మంత్రివర్గంలోంచి తీసేస్తారన్న లీకుల మధ్య ఢిల్లీకి వెళ్లి అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. తమను ఎలాగైనా కొనసాగించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ విధాన నిర్ణయం ప్రకారం కుటుంబంలోని ఒకే వ్యక్తికి ప్రభుత్వంలో కానీ పార్టీలో కానీ పదవులు ఇవ్వాలి. కానీ కోమటిరెడ్డి సోదరులు మాత్రం తమకు రెండు మంత్రి పదవులు ఉండాల్సిందేనని పట్టుబడుతున్నారు.

ప్రస్తుతం కీలకమైన హోం, శాంతి భద్రతల శాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరే ఉన్నది. ఆయన సరిగాదృష్టి సారించలేకపోవడంతో గతేడాదిలో నేరాల శాతం 22.53కు పెరిగింది. రాజధాని హైదరాబాద్‌లో ఏకంగా నేరాలు 44 శాతం పెరిగాయి. సాధారణ పరిపాలన సహా మిగతా శాఖలను తనవద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి కనీసం నెలవారీ సమీక్షలు కూడా నిర్వహించటం లేదు. కీలకమైన న్యాయం, జైళ్లు, అగ్నిమాపక లాంటి శాఖలు సీఎం వద్దే ఉండటం వల్ల పరిపాలనపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధానరంగాలైన పశు, మత్స్య సంవర్ధక శాఖలకు మంత్రి లేకపోవటం వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకోవటానికి అధికారులు సంకోచిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు విద్యాసంవత్సరం ప్రారంభాని కి రెండు నెలల సమయమే మిగిలి ఉంది. ప్రభుత్వ స్కూళ్ల ఏర్పాట్లు చూడాల్సిన విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉంది. గత ఏడాది కాలంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం కలుషితమవటం వల్ల చాలామంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమం లాంటి శాఖలను ఎవరికీ కేటాయించకపోవటం వల్ల ఆయా వర్గాల అభివృద్ధి గాడితప్పుతోంది. కొందరు మంత్రులకు అదనపు శాఖలు ఇవ్వటంతో పర్యవేక్షణ లోపం వల్ల ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మంత్రివర్గ విస్తరణను పూర్తి చేసి... ప్రభుత్వ పాలన , ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలి.ముఖ్యమంత్రి సైతం ప్రతిసారి ఢిల్లీకి వెళ్లి అధిష్ఠానం ముందు సాగిలపడకుండా పాలనపై దృష్టిసారించాలి.

- మరం బిక్షపతి, రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్

భూమి ఎందుకు అమ్ముకోవద్దంటే?

పులి రాజు
99083 83567

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తర్వాత, 1980లలో తెలంగాణలో నక్సలైట్ ఉద్యమం వచ్చింది. దీంతో గ్రామాల్లో ఉన్న భూస్వాములు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లు తమ తమ భూములను వదిలేసి పట్టణాలకు వలసపోయారు. ఆ తర్వాత ఆయా గ్రామాల్లో ఉన్న దిగువ, మధ్యతరగతి రైతులు కొంతమంది పట్టదారులయ్యారు. అయితే, ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఫామ్‌హౌజ్‌ల కోసం అంటూ పేర్లు మార్చుకొని మళ్లీ తెలంగాణ పల్లెల్లో నాటి వలసదారులే నేడు రైతుల నుంచి వందల ఎకరాల్లో భూములు కొంటున్నారు. ఈ నయా భూస్వామ్య విధానం మన కండ్లముందే సాక్షాత్కరిస్తుండటం విడ్డూరం. గతంలో అయితే భూస్వాములు కనీసం ఆ గ్రామంలోని రైతులకన్న పరిచయం ఉండేవారు. కానీ, ఆధునిక పట్టాదారులు ఆ గ్రామస్థులకు కూడా కూడా పరిచయం ఉండటం లేదు. ఫామ్‌హౌజ్ కల్చర్ అంటే ఇదేనా?

2005 వరకు తెలంగాణ పల్లెల్లో రైతులు అవసరాల కోసం తమ భూములు అమ్ముకుంటే పక్కన ఉన్న రైతులు, గ్రామస్థుల సమక్షంలో పంచాయతీ పెట్టి ఆ భూమికి ధర నిర్ణయించేవారు. మాట ప్రకారం డబ్బులు కట్టి సాదా బైనామా లేదా రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు. కానీ, ఇప్పుడు ఏ గ్రామంలోనైనా భూమి అమ్మితే కనీసం ఆ పక్కన ఉన్న రైతుకు కూడా తెలియడం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటే ఇదేనా? ఈ వ్యాపారంతో భూమిని రెండు రకాలుగా విభజించవచ్చు. 1.భూమిని నమ్ముకునేవారు (రైతులు), 2.భూమిని అమ్ముకునేవారు (కొని, అమ్మేవారు వ్యాపారులు). ఈ రియల్ ఎస్టేట్ వ్యాపార భూతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని రైతుల భూములను దావానలంలా దహించి వేస్తున్నది. పట్టణాల్లో, నగరాల్లో, విదేశాల్లో డబ్బుండి వ్యవసాయం అంటే కూడా తెలియని డబ్బున్న వారి చేతుల్లోకి తెలంగాణ వ్యవసాయ భూములు సగానికి పైగా వెళ్లిపోయాయి. ముఖ్యంగా హైదరాబాద్‌కు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల వ్యవసాయ భూములు సగం కంటే ఎక్కువగా ఆ గ్రామ రైతులు కాని రైతుల చేతుల్లోకి వెళ్లిపోయాయంటే అతిశయోక్తి కాదు. సిద్దిపేట జిల్లా, వర్గల్ మండలంలోని తునికి ఖల్సా గ్రామమే అందుకు ఉదాహరణ. ఈ గ్రామంలో నేను ఏడేండ్లుగా ఉంటూ పరిశీలించి, పరిశోధన చేసిన అంశాలు ఇవి.

ఈ గ్రామం నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 20 కిలో మీటర్ల (హైదరాబాద్ నుంచి 50 కిలో మీటర్లు) దూరం, రాజీవ్ రహదారికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తుంది. స్థూలంగా ఈ గ్రామ స్వరూపాన్ని తీసుకున్నటయితే ప్రస్తుత జనాభా సుమారు 4,600. కాగా ఈ గ్రామంలోని మొత్తం కుటుంబాల సంఖ్య 930. రెవెన్యూ ప్రకారం ఈ గ్రామంలో భూమి విస్తీర్ణం సుమారు 4,192 ఎకరాలు. ఓటర్ల సంఖ్య 2,400. ఆ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 3300 ఎకరాల భూమి ఉన్నది. కాగా, ఆ గ్రామ రైతుల చేతుల్లో ఉన్న భూమి 1,113 ఎకరాల 33 గుంటలు. పట్టా భూమి 947 ఎకరాలు 33 గుంటలు. ప్రభుత్వ భూమి 166 ఎకరాలు. ఈ గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభం కాగా, 2006లో ఒక ఎకరా రూ.35 వేల చొప్పున అమ్ముడుపోయింది. ఈ గ్రామంలోని 1,203 ఎకరాల భూమి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తుల చేతుల్లోకి పోయింది. మిగతా భూమిలో చెరువు కుంటలు 15, ఒక్క వాగు, అడవి, గుళ్లు గోపురాలు, పాఠశాలలు, పార్కు, కరెంట్ సబ్‌స్టేషన్ వంటివి ఉన్నాయి. ఈ గ్రామంలో ప్రస్తుతం భూమి ఉన్న కుటుంబాల సంఖ్య 534. భూమి లేని కుటుంబాల సంఖ్య 396. 1995 నుంచి 2014 వరకు సుమారు రెండు దశాబ్దాల పాటు తెలంగాణలో విపరీతమైన కరువు ఏర్పడటంతో వ్యవసాయం మీద నమ్మకం పోయింది. రైతులకు తమ బతుకుపై భరోసా లేక, ఇతర అవసరాలు, కుటుంబ పోషణ భారం అవడంతో భూములను 'అడ్డీకి పావుశేరు లెక్కన' అమ్ముకున్నారు. ఆ కరువు సమయంలో డబ్బులున్నవాళ్లు వ్యవసాయ భూములను ప్రాంతాలకతీతంగా కొనుగోలు చేశారు.

ఈ గ్రామానికి రోడ్డుకు ఇరువైపులా భూములను ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇప్పటికే కొనేశారు. ఈ గ్రామం హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండటంతో 50 శాతం కంటే ఎక్కువ భూమి ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇక్కడ ఒక ఎకరా ధర రూ.2 కోట్ల వరకు పలుకుతున్నది. గ్రామస్థులు కనీసం ఇల్లు కట్టుకుందామన్నా జాగ కొనుక్కోలేని పరిస్థితి. భూమి ఉన్న రైతులకు మాత్రం అమ్ముకుంటే ధర వస్తదనే ఒక భరోసా అయితే మిగిలింది. గ్రామాలు హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటం వరమా? శాపమా? ఈ గ్రామంలోని 150 ఎకరాల్లో విత్తన పరిశోధన కేంద్రం ఉన్నది. అందులో ఈ గ్రామానికి చెందిన మహిళలు దాదాపు 100 మంది పనిచేస్తారు. మిగతా భూముల్లో చుట్టూ కాంపౌండ్‌వాల్స్ పెట్టి ఇందులో సోలార్ పవర్ ప్లాంట్, మామిడితోటలు, నర్సరీలు, స్పిన్నింగ్ మిల్, ఫామ్‌హౌజ్‌లు కట్టుకున్నారు. అందులో కనీసం గ్రామస్థులకు కూడా పని దొరకదు. ఈ భూములన్నీ పడావుగా ఉన్నాయి.

సామాజిక వర్గాల వారీగా ఈ గ్రామంలో మొత్తం 93 కుటుంబాలు ఉండగా, అందులో ఎస్టీ-5, ఎస్సీ-230, బీసీ-630, ఓసీ-65, ముస్లిం మైనారిటీ-40 మొత్తం కుటుంబాలున్నాయి. భూమి ఉన్న కుటుంబాల సంఖ్య మొత్తం 534 కాగా, సామాజికవర్గాల వారీగా ఎస్టీ-0, ఎస్సీ-135, బీసీ-363, ఓసీ-36, ముస్లిం మైనారిటీ-25 కుటుంబాలకు భూమి ఉన్నది. 2025 ఫిబ్రవరి నాటికి పరిస్థితి భూ విస్తీర్ణం, కుటుంబాల సంఖ్య 534 అయితే, 0.01 గుంటల నుంచి 20 గుంటల భూమి ఉన్న కుటుంబాలు 120. 0.21 గుంటల నుంచి ఒక ఎకరం భూమి ఉన్న కుటుంబాలు 105. 1 నుంచి 2 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 115. 2 నుంచి 3 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 90, 3 నుంచి 4 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 40. 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 29. 5 నుంచి 6 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 15. 6 నుంచి 7 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 7. 7 నుంచి 8 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 1. 8 నుంచి 9 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 3. 9-10 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 2. 10 నుంచి 15 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 3, 15 నుంచి 18 ఎకరాల భూమి ఉన్న కుటుంబాలు 4.

ఈ గ్రామంలో మంచి పంటలు పండించే రైతాంగం ఉన్నది. వారి భూమితో పాటు 120 కుటుంబాలు కౌలుకు తీసుకొని మరీ వ్యవసాయం చేస్తున్నారు. ఇక్కడ ప్రధాన పంటలు వరి, కూరగాయలు, ఆకుకూరలు. ముఖ్యంగా ఈ గ్రామం ఆలుగడ్డకు ప్రసిద్ధి. ఈ గ్రామానికి 6 కిలోమీటర్ల దూరంలో వంటిమామిడి కూరగాయల మార్కెట్ ఉన్నది. కాబట్టి, చాలామంది రైతులు కూరగాయలే పండిస్తారు.

రాష్ట్రంలో పట్టణాలకు సమీపంలో, హైదరాబాద్‌కు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లో కొంచెం ఎక్కువ, తక్కువగా అన్ని గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉన్నది. రైతులు కాని వారి చేతుల్లో భూమి ఉన్నది. అందులో పంటలు పండటం లేదు. వారు కేవలం స